తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## కన్నులపండువగా శ్రీచెంగాళమ్మకు పుష్పయాగం

సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళ మాతా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పుష్పాభిషేకాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగ ణంలోని మండపంలో అమ్మణ్ణి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి రంగు రంగుల పూలతో అమ్మణ్ణికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా పుష్పయాగాన్ని నిర్వహించారు. నంబూరి మనోజ్ కుమార్, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు మద్దూరి శారద, బండి సునీత, ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంకా దినేష్, ఓలేటి బాలసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోపిక, కృష్ణుడు వేషధారణలో చిన్నారులు సాహ్నా, వహీన్, దీక్షిత

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ఇస్కాన్ మందిరంలో భక్తుల రద్దీ.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అలంకరణలో రాధా కృష్ణ సమేత గోపికలు

తిరుపతి కలెక్టర్, ఆగస్టు 19 ప్రభాతవార్త : హరే రామ హరే కృష్ణ రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో శుక్రవారం వైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. రాధాకృష్ణ సమేత గోపికలకు కమల మందిరం అర్చకులు మురళీ గోవిందు ప్రభు, గోపాల్ ప్రభు, కౌన్‌తీయా ప్రభు, అచ్చుత్ రాఘవ ప్రభు, లీలా పారాయణ దాస్ ప్రభు, భక్త బృందం ఫలపుష్పాదుల అలంకరణ పిమ్మట ఉదయం 4.15 గంటలకు మంగళ హారతి నిర్వహించి 9 గంటల నుంచి రాత్రి 11.45 గంటల వరకు శృంగార హారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు, శ్రీ కృష్ణ భక్తులు, మహిళలు, యువత, చిన్నారులు, వీఐపీ, వీవీఐపీలు దాదాపు లక్షకు పైగా భక్తులు రాధా కృష్ణ స్వామి, గోపికలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేశ, విదేశాల నుంచి తెప్పించి స్వామి, అమ్మ వార్లు, గోపికలకు అలంకరించిన పండ్లు, ఫల, పుష్పాదులు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి 11 గంటలకు శ్రీశ్రీ రాధా గోవిందులకు మహా శంఖాభిషేకం నిర్వహించారు. దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నేడు భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల వారి 126వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పీఆర్వో లీలా పారాయణ దాస్ ప్రభు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గోవిందుని ఆలయంలో

# గోకులాష్టమి ఆస్థానం



తిరుమల, ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో శుక్రవారం వేడుకగా గోకులాష్టమి ఆస్థానం జరిగింది. శ్రీకృష్ణుడే శ్రీనివాసుడుగా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల బంగారువాకిలి ముఖమండపంలో రాత్రి 7గంటల నుంచి 9వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహించారు. బంగారుసర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామివారిని వేంచేపుచేసి నివేదనలు సమర్పించారు. ఇక్కడ శ్రీఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవిభూదేవిఅమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామివారికి ఏకాంత తిరుమంజనం నిర్వహించారు. అంతకుముందు ఉదయం గోగర్భండ్యామ్ వద్ద వున్న ఉద్యానవనంలోని కాళీయ మర్ధిన శ్రీకృష్ణుని విగ్రహానికి ఉద్యానవనవిభాగం విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ఉట్లోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పెద్దశేషవాహనంపై శ్రీకృష్ణుడు విహారం



తిరుచానూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీకృష్ణ స్వామివారు శుక్రవారం పెద్దశేషవాహనంపై ఉభయ దేవేరులతో కలిసి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఇందులో భాగంగా స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మద్యాహ్నం కృష్ణస్వామి ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారిని సుగంధ పుష్పాలు, పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, పెద్దశేషవాహనంపై కొలువుతీర్చి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్‌లు శేషగిరి, మధుసూధన్, టెంపుల్‌ఇన్స్‌పెక్టర్లు దాము, ప్రసాద్, అశోక్‌కుమార్, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, విఐ రామ్మోహన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.



నారాయణవనం మండలం భీమునిచెరువు గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణుని జన్మష్టమిని పురస్కరించుకొని రాత్రి పెద్దశేషవాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలుడు

4లో

## శ్రీవారి చెంత ఆద్యంతం భక్తితో

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



తిరుమల, ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు తిరుమల ఆలయంలో ఆద్యంతం భక్తిభావంతో గడిపారు. రెండురోజుల తిరుపతి, తిరుమల పర్యటనలో శుక్రవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరికి టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. జస్టిస్ ఎన్‌వి రమణతోబాటు మాజీ తిరుమల జెఇఓ, తెలంగాణారాష్ట్రం పర్యాటక శాఖ కార్యదర్శి కెఎస్ శ్రీనివాసరాజు ఉన్నారు.

## అమ్మవారి సేవలో

# సుప్రీం ప్రధాన న్యాయమూర్తి

తిరుచానూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయం ఎదుట టిటిడి ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలోని ధ్వజస్థంభానికి మొక్కుకున్న అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అధికారులు సిజేఐ కుటుంబానికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈఓ ధర్మారెడ్డి శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. చీఫ్ జస్టిస్‌తో పాటు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయన్, ఏపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవి. రవీంద్రబాబు, జస్టిస్ దుప్పాల వెంకటరమణ, జస్టిస్ చక్రవర్తి విజయలక్ష్మి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ జస్టిస్ కొంగర విజయలక్ష్మి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లలితా కనిగేటి, చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జస్టిస్ భీమ్‌రావు, తిరుపతి ఏడిజె, చీఫ్ ప్రొటోకాల్ జస్టిస్ వీర్రాజు, తదితరులు ఉన్నారు.

## తీర్థ యాత్రలో

# విషాదం



మృతి చెందిన పెరియస్వామి

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయు లింగేశ్వరుని దర్శనానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్న తమిళనాడు లోని ధర్మపురికి చెందిన 50 మంది భక్తులు వచ్చారు. వారు గురు వారం తిరుమలేశుని దర్శనం చేసుకొని శుక్రవారం వేకువ జామున శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఇక్కడ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారు తిరుగు పయనానికి సిద్ధమయ్యే తరుణంలో బస్సు స్టార్ట్ చేస్తుండగా సాంకేతిక కారణాలేమో కానీ టూరిస్టుబస్టాండుగోడకు ఢీకొంది. దాంతో గోడకూలింది. బస్సులో ఎక్కడా నికి ఉన్న పెరియస్వామి(55) ఆయనతో పాటు మునియప్ప, కామరాజులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే పెరియస్వామి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తెతో కలసి తీర్థ యాత్రకు వచ్చారు. ఈ సంఘటనతో తీర్థయాత్రకు వచ్చిన వారిలో విషాదం చోటు చేసుకుంది,

# శాస్త్రోక్తంగా అష్టబంధ సమర్పణ

### -కొనసాగుతున్న కుంభాభిషేకం పూజలు

కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవ స్థానంలో జరుగుతున్న ప్రధాన ఆలయ చతుర్వేద హవన సహిత మహా కుంభాభిషేకం పూజల్లో భాగంగా ఐదవరోజు శుక్రవారం ప్రధాన ఆలయంలో అష్టబంధన సమర్పణ నిర్వహించారు. ఆదివారం జరుగనున్న ఆలయ మహాకుంభాభిషేకంకు సంబంధించి ఈనెల 15 నుండి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో రుత్వికులు, వేదపండితులు కుంభాభిషేకం పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదో రోజు ఆలయంలో అష్టబంధన సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా యాగశాలలో ఉదయం చతుర్వేద పారాయణం, చతుర్వేదహవనం, లఘుపూర్ణా హుతి, కలశారాధన, నీరాజన మంత్రపుష్పములు, అస్త్రహోమం, దిశాహోమం, అగ్నిసంగ్రహణం, యాగశాల నిర్మాణం, తదితర పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహావాచనం, సోమ కుంభపూజ, కుంభాలంకారం, కళాకర్షణం, యాగశాల ప్రవేవం, ప్రథమకాలపూజ, హోమము, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా నూతన ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు, బలిపీఠాలు,



విమాన గోపురం కలశం, నూతన ధ్వజస్థంభం, మూషిక విగ్రహానికి నవ పాషా ణాలలో అష్టబంధనం సమర్పణ నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ పునర్నిర్మాణ దాతలు గాయత్రీదేవి, ఐకా రవి, జానకి, గుత్తికొండ శ్రీనివాస్, పద్మజ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ దంపతులు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఏసీ కస్తూరి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీనివాస్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, వేదపండితులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు హాజరు పరీక్ష!

### సెల్‌ఫోన్లు తీసుకుని తలో మూలకు..

కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

తరగతి గదిలో ఉండి పిల్లలకు బోధన చేయాల్సిన ఉపాధ్యాయులు చరవాణీ చేత పట్టుకుని పాఠశాల ప్రాంగణం అంతటా తిరుగుతున్నారు.. తమ ఫోన్లకు సిగ్నళ్లు ఎక్కడ బాగా వస్తాయో అని చూసుకుంటున్నారు. సిలబస్ పూర్తికి పోటీ పడాల్సిన ఉపాధ్యాయులు ప్రస్తుతం హాజరు వేసుకొవటానికి పోటీ పడుతున్నారు. ఏ పాఠశాలల చూసినా ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్దితి ఇదే. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 16 నుంచి ఉపాధ్యాయుల హాజరు నమోదకు ఇంటిగ్రేటెడ్ యూప్ తీసుకొచ్చింది. అది వారికి అగ్ని పరిక్షగా మారింది. సర్వర్ సామర్ధ్యలేమితో ఆయాప్ సరిగా పనిచేయక గురువులకు చుక్కలు చూపిస్తోంది. ప్రతిరోజూ ఉపాధ్యాయులు పాఠశాల విధులకు హాజరైనప్పుడు తిరిగి ఇంటికి వేళ్లెటప్పుడు కచ్చితంగా ఆయాప్ నుంచే రెండు సార్లు హాజరు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక వేళ ఎవరైనా ఉపాద్యాయుడు హాజరు



వేసుకొకపోతే వెంటనే ఆస్కూల్ హెచ్‌ఎంకు ఎస్సెమ్మెస్ వస్తుంది. దానికి ప్రధానోపాధ్యాయుడు వివరణ ఇచ్చుకోవవాల్సి ఉండటంతో ప్రధానోధ్యాయుల నుంచి సైతం ఉపాద్యాయులపై ఒత్తిడి విపరీతంగా ఉంటోంది. ఒకవైపు ఉపాధ్యాయ సంఘాలు యూప్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ హాజరు వేసుకోవద్దని సూచిస్తున్నా ఉపాధ్యాయులను భయం వెంటాడుతోంది.

కొందరమో తరగతి గదిలో పిల్లలకు ఏదో ఒక అసైన్‌మెంట్ ఇచ్చి అది రాస్తూ ఉండాలని సూచించి బయటకు వచ్చి యూప్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇంకొందరు పాఠం బోధించి సంగతి దేవునికి ఎరుక ముందు హాజరు వేసుకున్నాకే పాఠ్యాంశం మొదలు పెడతామని నిమిషాల కొద్దీ స్కూల్ ప్రాంగాణంలో నే ఉంటున్నారు. హెచ్‌ఎంలు సైతం అందరు ఉపాధ్యాయులు హాజరు వేసుకున్నారా అని ఆరా తీయటం కనిపిస్తుంది. 8 గంటల నుంచి 8.30 లోపు సర్వర్ కలుస్తోంది. ఆతర్వాత అందరూ వచ్చి ప్రయత్నిస్తుండటంతో సర్వర్ పై రద్దీ పడి సమస్యలు వస్తున్నాయి. హాజరు వేసుకొవటం ఒక పరీక్షలా మారింది. ఉదయం పూట మంచి మంచి ప్రశాంత వాతావణంలో పిల్లలకు ఒక ప్రేరణతో బోధన చేస్తే దాని వల్ల ప్రయోజనం ఉంటుంది. అలా కాకుండా టెన్షన్ పడుతుంటే ప్రశాంత బోధనకు ఇబ్బందేనిని మరి కొందరు ఉపాధ్యాయులు వాపోతున్నారు. తిరుపతి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 2145 ఉండగా, ప్రభుత్వ అనుంబంధ పాఠశాలలు ,163 ఉన్నాయి. అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 5,867 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సమయంలో యూప్ ఓపెన్ చేయడం ద్వారా సాంకేతక సమస్యలు వస్తున్నాయని ఉపాధ్యాయు వాదనగా ఉంది. బయో యంత్రాల్లో హాజరు వేసుకునే పాత విధానాన్ని ప్రవేశ పెట్టాలని ఉపాధ్యాయులు కొరుతున్నారు.

## ఉష్ణోగ్రతలు

19/8/2022



- తిరుపతి 33 డిగ్రీలు
- చిత్తూరు 35 డిగ్రీలు
- మదనపల్లి 28 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 35 డిగ్రీలు
- వెంకటగిరి 36 డిగ్రీలు
- గూడూరు 35 డిగ్రీలు

## బంగారం ధరలు

19/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,822

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,260

## కోడిగ్రుడ్ల ధరలు

19/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కుప్పంరూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త

కుప్పంపట్టణంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గుడుపల్లె రోడ్‌లోని శ్రీకృష్ణార్జున ఆలయంలో స్వామి వారికివిశేషపూజలునిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు. అలాగేసుజ్ఞానందఆశ్రమంలోఉదయంనుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, నామసంకీర్తన, రాధాకళ్యాణం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**శాంతిపురం:** మండలంలోకృష్ణాష్టమిపండగనుఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. చిన్నారులకు చిన్నికృష్ణుల వేషధారణ చేపట్టారు.

**రామకుప్పం:** మండలంలోకృష్ణాష్టమివేడుకలనుఘనంగా నిర్వహించారు. విజలాపురం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ ఆలయం అతిపురాతనమైనది కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు చిన్నారులకు చిన్నికృష్ణుల వేషధారణ చేయించారు.

## తవణంపల్లెలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తవణంపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త:

శ్రీకృష్ణాష్టమి పండుగ పర్వదినాన్ని మండల ప్రజలు శుక్రవారం అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోనిఅరగొండ, మత్యం, ఎం. గొల్లపల్లె, జొన్నగురకల, నల్లిశెట్టిపల్లె, నారసింహన పల్లె, దిగువమాఘం, వీర్లగుడిపల్లె, తదితర గ్రామాలలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. అలాగే రాత్రి తనకిష్టమైన గరుడవాహనంపై స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. అలాగే ప్రతి ఇంటిలోనూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగేచిన్నపిల్లలుశ్రీకృష్ణుడు, రాధాదేవి, సత్యభామ వేషధారణలతో ఇళ్ళలో మురిపించారు.

## మహా కుంభాభిషేకంకు ఏర్పాట్లు పూర్తి

–ఆలయ ఛైర్మన్, ఈఓలు

కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగనున్న ప్రధాన ఆలయ చతుర్వేద హవన సహిత మహాకుంభాభిషేకంకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం వారు ఈఓ కార్యాలయంలో విలేకరులతోమాట్లాడుతూ ఈనెల 21న ప్రధాన ఆలయ మహా కుంభాభిషేకం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు ఈకార్యక్రమంను దిగ్విజయంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈమేరకు ఆలయంలో 21న ఉదయం 8 గంటల నుండి 9 గంటల మధ్య కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని ఈఓ తెలిపారు. ఆలయంలో కుంభాభిషేకం అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుండి భక్తులకు దర్శనం వుంటుందని తెలిపారు. అలాగే ఈనెల 23 వరకు స్వామివారి దర్శనం మాత్రం వుంటుందని, ఆర్జిత సేవలన్ని 24 నుండి యధావిధిగా జరుగుతుందని ఈఓ సురేష్‌బాబు తెలిపారు.

## సరిహద్దు గ్రామాల్లో తీరిన బిఎస్ఎన్ఎల్ టవర్ సమస్య

కుప్పంరూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త



మండలంలోని సరిహద్దు గ్రామాలైన న ె ద ె వ యా ం ె ు , సింగారపురం, అడవిబూదుగూరు, నాయనూరు, దేవ రాజపురం గ్రామాల్లో ప్రజలకు బిఎస్ఎన్ఎల్ టవర్ల సమస్య తీరింది. చాలా ఏళ్లుగా ఈ ప్రాంతాల్లో సెల్‌ట వర్‌సిగ్నల్స్‌రాక ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ చొరవ చూపారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు సిగ్నల్స్ అందేలాశనివారంబిఎస్ఎన్ఎల్ అధికారులు ఫ్రీక్వెన్సీ పెంచారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

## 22న సీజ్ చేసిన వాహనాల వేలం

శాంతిపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త

వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఐదు మోటారు సైకిళ్లను జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 22న రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్సై మునస్వామి

## క్రిస్టియన్ సెల్ పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

చిత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:



తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు క్రిస్టియన్ సెల్ పార్లమెంట్ అధ్యక్ష, కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసారు. చిత్తూరు పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా చిత్తూరు నియోజకవర్గానికిచెందినరాజేంద్రమేషక్, ప్రధానకార్యదర్శిగా జిడినెల్లూరు నియోజకవర్గానికిచెందిన వై.రజనీకాంత్‌ను నియమించారు.

## విజయం విద్యాసంస్థల అధినేతకు ఉన్నతవిద్యామండలిచే సత్కారం

చిత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:



నాక్ ఏ+ గ్రేడ్ సాధించిన విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల అధినేత డా.ఎం.తేజోమూర్తిని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఘనంగా సత్కరించారు. విజయవాడలోని ఆంధ్ర లోయల కాలేజ్ ప్రాంగణం నందు జరిగిన అభినందన సభలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ హేమచంద్రారెడ్డి, వైస్‌ఛైర్మెన్ కె. రామమోహన్‌రావు చేతుల మీదుగా డా.ఎం.తేజోమూర్తి ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందుకొన్నారు. ఈ అభినందన సభలో కళాశాల విప్రో క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ బి.జగదీశ్వర్, కంప్యూటర్ ఫ్యాకల్టీ ఎం.ఎస్.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

తవణంపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త:

ఈనెల 21, 22 తేదీల్లో జిల్లా కేంద్రం చిత్తూరులో జరిగే సీపీఐ 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రం తవణంపల్లెలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఆటోయూనియన్ నాయకులు యుగంధర్, నాయకులు విక్రమ్, రవి, శీను, హరి, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా శనివారం మండలంలోని పూతలపట్టు నియోజకవర్గ స్థాయి పార్టీ మహాసభలు గాజులపల్లెలో జరుగుతుందని పార్టీ నాయకులు సురేంద్రనాథ్ తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

వేదురుకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండలంలోని పలు శ్రీకృష్ణ మందిరాలను నిర్వహకులు ముస్తాబు చేసి వేడుకలు నిర్వహించారు. చిన్నికృష్ణును ప్రత్యేకంగా అలంకరించి వివిధ అభిషేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయంకు విచ్చేసి దైవ దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. చవటగుంట ద్రౌపది సమేత ధర్మాజుల ఆలయంలో చిన్ని కృష్ణుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దోమల నియంత్రణతో అనేక వ్యాధులు దూరం

సదుం, ఆగస్టు 19 ప్రభాతవార్త



ప్రాణాంతక వ్యాధులను కలిగిస్తున్న దోమలను నియంత్రణ చేయడంతోనే అనేక వ్యాధులు దూరం అవుతాయని చెరకు వారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి చరణ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని సదుం పంచాయతీ పుట్టా వారిపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. దోమల నిర్మూలనపై గ్రామసు ్థలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ దీప, ఆరోగ్య కార్యకర్త హేమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మకు రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 19 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాలాభిషేకాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణగావించారు. అనంతరం రాహుకాల సమయంలో జరిగిని అభిషేకానికి విశేష స్పందన లభించింది. రాహుకాలసమయంలో అమ్మవారిని అభిషేకించే సమయంలో దంపతులు పూజలో పాల్గొంటే శుభం జరుగుతుందన్న విశ్వాసం భక్తుల్లో వుంది. ఇఓ చంద్రమౌళి, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫోటోగ్రాఫర్ల దినోత్సవం

శాంతిపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త



శాంతిపురంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాలాజీ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఎస్సై మునస్వామి ప్రసంగించారు. ఫోటోగ్రాఫర్లు సమాజసేవలో పాలుపంచుకోవాలని అలాగే ఐకమత్యంగా ఉండాలన్నారు. అనంతరంకెజిఎఫ్‌సర్కిల్‌లో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, సర్పంచ్ ఎవి జయరాం, సీనియర్ ఫోటోగ్రాఫర్లు నారాయణరెడ్డి, ఎవి ఆదినారాయణ, నాగభూషణంరెడ్డి, కృష్ణమూర్తి, ఉమాశంకర్‌రెడ్డి, రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా : చంద్రబాబు

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా సిద్ధంగా ఉంటానని తెదెపా అధినేత చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. ఇటీవల కూసూరులో జరిగిన ఘర్షణలో వైకాపా నేతలు కొందరు తెదేపా సానుభూతిపరులపై దాడి చేయగా వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం వారికి ఫోన్ చేసి పరామర్శించారు. వైకాపా నేతల ఆగడాలు రోజురోజుకూ పెరిగాయని ఈవిషయంగా ఇదివరకే డిజిపికి లేఖ రాశానని, కార్యకర్తలు భయపడొద్దని చంద్రబాబు సూచించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కుప్పం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎంపిపి సాంబశివం, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మణి, మాజీ సర్పంచ్ వల్లెప్ప, రాష్ట్ర నేత శాంతారాం, విఎస్ఎస్ ఛైర్మన్ కనకరాజ్ తదితరులు పరామర్శించారు.

## అందాల ప్రపంచం సృష్టికర్తలు ఫోటోగ్రాఫర్లు

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త



ప్రపంచంలో అందమైన అద్భుతాలతో పాటు ఆలోచనలను చిత్రీకరింపజేసే నైపుణ్యం ఫోటోగ్రాఫర్లకే ఉంటుందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎన్నోవింతలు, విశేషాలతో పాటు ప్రజల యొక్క మనోభావాలు, వారి జీవన విధానాలను ఫోటోల రూపంలో చిత్రీకరించే ఫోటోగ్రాఫర్లు ఎంతో కీలకమన్నారు. ఒక్క ఫోటో దృశ్యం సమాజంలో ఎన్నో ఆలోచనలను కలిగిస్తుందన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్వేతదీప గ్యాస్ ఏజెన్సీ అధినేత విసి అజిత్ ఆనంద్, కమీషనర్ రవిరెడ్డి, ఫోటో గ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు ఉమాపతి, సంఘ నేతలు లేపాక్షి, గౌస్, శంకర్, గురు, సుబ్బు, శివ, శరత్, శరవణతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



బంగారుపాళ్యం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

మండల కేంద్రం బంగారుపాళ్యం నందు శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రభోద సేవాసమితి హిదూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించారు. బంగారుపాళ్యం రాజా వీధిలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. మాజీ జడీ ్ప ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపీటీసీ పద్మావతి, సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి తదితరులు శ్రీకృష్ణునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే బంగారుపాళ్యం ఎస్సీవాడలో శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేకపూజలు చేసి ఊరేగింపు చేపట్టారు. ఇందు జడ్పీటీసీ సోమశేఖర్, ప్రభోద సేవాసమితి సభ్యులు బాలాజీ, ధనంజయ, వినీష్, హేమంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి , బాలాయపల్లి దొరవారిసత్రం,

## బలవంతంగా చందాలు వసూళ్లు చేస్తే చర్యలు : సిఐ

కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

వినాయక చవితి పండగను పురస్కరించుకొని వాకాడు పోలీస్ సర్కిల్ సరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలల్లో ఏవరైనా దందాలు, చవితి చందాలకు బలంతంగా వసూళ్లకు పాల్పడితే చట్టరిత్యా చర్యలు తీసుకొంటామని వాకాడు సిఐ హరికృష్ణ హెచ్చరించారు. ఆమేరకు ఆయన శుక్రవారం ప్రభాతవార్త తో మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా చందాలు ఇస్తే తీసుకొవాలే తప్ప బలవంతంగా వసూళ్ల చేయరాదన్నారు. ఎక్కాడైన బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని తెలిస్తే అటువంటి వారిపై చట్టరిత్యాచర్యలుతప్పవన్నారు. గ్రామాల్లోయువకులు ప్రశాంతంగా వినాయక చవితి జరుపుకొవాలన్నారు.

## కోటలో ఘనంగా కృష్ణాష్ణమి వేడుకలు



కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

హరే కృష్ణ..హరే కృష్ణ.. కృష్ణ.. కృష్ణ..హరే హరే అంటూ కృష్ణ మందిరాలు మర్మోగాయి. కోటలోని చిన్నామయ మిషన్, కన్యకాపరమేశ్వరి ఆలయంల్లో ,తిన్నెలపూడిలోని శ్రీ కృష్ణమందిరంలో శుక్రవారం కృష్ణాష్ణమి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, శ్రీకృష్ణుడుకి ప్రత్యేక పూజలు, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం, భజనలు చేశారు. అనంతరం మహా మంగళహారతి,, తీర్థప్రసాదాల వినియోగం, జరిగింది. నధుల నుంచి సేకరించిన పవిత్ర జలాలు కలశాలతో పళ్ల రసాలు, పంచామృతం ,పంచగవ్యాలతో వివిధ పుషాలతో మహా అభిషేకం జరిపారు.

## పోలేరమ్మ కిరీటానికి మాజీ ఎంపిపి వితరణ

వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త



గ్రామస్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి స్వర్ణ కిరీటానికి డక్కిలి మండల మాజీ ఎంపిపి పోలంరెడ్డి వెంకటరెడ్డి, మం దల టిడిపి అధ్యక్షుడు పి.కోటేశ్వ రరెడ్డిలు 41 వేల 116 రూపాయలను విరాళంగా ఆలయం ట్రస్టుబోర్డు సభ్యులు ఆవుల మోహన్ యాదవ్, ఈఇ శ్రీనివాసుల రెడ్డికి అందజేశారు. ఆలయ మర్యాదలతో వారికి సత్కరించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



వెంకటగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. బంగారుపేటలోని కృష్ణ మందిరంలో రాధాకృష్ణులను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదారం చేశారు. బంగారుపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా కృష్ణజన్మష్టమి వేడుకలను నిర్వహించారు. మండ ెలంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

## సూళ్లూరుపేటలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త

హిందువుల పర్వదినమైన శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వైష్ణవ ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక షార్ బస్టాండు వద్ద శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరిపారు. అలాగే పట్టణంలోని శ్రీమద్వేంకట రామమూర్తి దేవస్థానంలో స్వామివారు శ్రీకృష్ణుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెట్టి వేణు, మిజూరు రామకృష్ణారెడ్డి, చిన్ని సత్యనారాయణ, గోగుల తిరుపాల్, వజ్రమణి, వంకా రామాంజనేయులు, అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు



దొరవారిసత్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల పరిధిలోని తనియాలి, ఉచ్చూరు, పూలతోట, శ్రీధనమల్లి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి పటానికి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామాల్లో ఉట్టి ఏర్పాటు చేసి పిల్లలతో ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లెల్లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు.

## తడలో కృష్ణాష్టమి, శ్రావణ శుక్రవారం పూజలు

తడ, ఆగస్టు 19 ప్రభాతవార్త

తడ మండలంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలతో పాటు శ్రావణ పూజలు కూడా సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారం రోజు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఇదేరోజు కృష్ణాష్టమి కూడా రావడంతో ఒకేరోజు రెండు పండగలు వచ్చినట్లయింది. మండల పరిధిలోని పలు వైష్ణవాలయాల్లో వేడుకలు ఘనంగా జరిపారు. తడ, అండగుండలలోని సాయిబాబా ఆలయాలతో పాటు చేనిగుంట, చినమాంబట్టు, బోడిలింగాలపాడు, పన్నంగాడు, వేనాడు, వాటంబేడు ఆలయాలలో కూడా ఈ పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థికసాయం

చిల్లకూరు/కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

మండలంలోని కడివేడు గ్రామంలో ముస్లీంకాలనీకి చెందిన ఎస్‌కెబాబు బేల్దారి పనిచేస్తూజీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమై ఉన్న విషయాన్ని కోట పట్టణానికి చెందిన గ్రీన్‌ఫౌండేషన్ దాతృత్వంలో శుక్రవారం 20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఎస్‌కె జలీల్ అహ్మద్, సంషుద్దీన్, నాయబ్‌రసూల్, నౌషద్, నిజా ముద్దీన్ పాల్గొన్నారు.

## రెస్కో మాజీ ఉపాధ్యక్షుడు గంగప్ప మృతి.. చంద్రబాబు సంతాపం

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) మాజీ ఉపాధ్యక్షుడు బి.కె. గంగప్ప (73) శుక్రవారం రాత్రి మృతి చెందారు. గుడుపల్లె మండ లంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతగా, మండల టిడిపి అధ్యక్షుడిగా గతం లో ఈయన పనిచేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఈయన మృతి పట్ల తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్ నేతగా బికె గంగప్ప పార్టీ అభ్యున ్నతికి శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. గంగప్ప కుటు ంబీలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ వారికి అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

## ఘనంగా ఆర్వీటిబాబు జన్మదిన వేడుకలు

పుంగనూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త ఆర్వీటిబాబు జన్మదిన వేడుకలను ఆయన అనుచరులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని విధానపరిషత్తు వైద్యశాలలో చికిత్సపొందుతున్న వారికి బ్రెడ్డు, పాలు, పండ్లు పంపిణీచే శారు. ఈసందర్భంగా ఆయన అనుచరులు మాట్లాడుతూ పట్టణంలో యువతకు మార్గదర్శకంగా ఉంటూ అనేక సేవలందిస్తున్న ఆర్వీటి బాబు లాంటి నాయకుడు ఉన్నత స్థాయిలకు ఎదగాలని అభిలషించారు. ఏమాత్రం ఫలాపేక్షలేకుండా మూడుదశాబ్దాలకుపైగా పట్టణంలోని పేదలకు సేవలందించడమే కాకుండా ప్రతిఏటా అయ్యప్పస్వాముల వారికి పెద్దఎత్తున సాయమందిస్తున్న ఆర్వీటిబాబు ముస్లింమైనార్టీ వర్గాలకు చెందిన పేదలకు కూడా సాయపడుతున్నారన్నారు.

## ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వం సాయం చేయాలి

పుంగనూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



ఫోటోగ్రాఫర్లకుప్రభుత్వం సాయమందించేలా చర్యలు చేపట్టాలనిసంఘనాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ వృత్తిగా జీవిస్తున్నవారికి కూడా ప్రభుత్వం ఇండ్లు, ఉపాధిసాయా లందించడానికిముందుకురావాలన్నారు. సెల్‌ఫోన్లలో తీసుకునే ఫోటోలను ప్రభుత్వ కార్యక్రమాలకు అనుమతించరాదని, రిజిస్ట్రేషన్‌చేసుకున్న ఫోటోస్టుడియోల నుంచి తీసుకున్న ఫోటోలను మాత్రమే అనుమతించేలా ఆదేశాలుజారీచేయాలని, అదేరీతిలప్రతినియోజకవర్గకేంద్రంలోఫోటోస్టుడియోలవారికి రాయితీలు, సాయాలు, ఇండ్లపట్టాలుఅందచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లేక .. జూనియర్ మహిళా కళాశాల వెలవెల..

కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలల నిర్వహణ ఒక అడుగు ముందుకు...నాలుగు అడుగులు వెనక్కి చందంగా ఉంది. మౌలిక వసతులు, ఇతర సౌకర్యాల గురించి పట్టించుకోకపోవడంతో స్థానికంగా ఇబ్బంది ఉన్నా.. ఆయా బడుల్లోనే కొనసాగించాల్సిన పరిస్థితి. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇది స్వాగతించాల్సిన అంశమే. వీటి నిర్వహణ. సాధ్యసాధ్యాలను పరిశీలించకుండా చేపట్టడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంకు ముందు చూపు లేకుండా పోవడం, అవగాహన లేకపోవడంతో కోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన పదోవ తరగతి విద్యార్థులను ఇతర కళాశాలలో చేరి పోయారు. దీంతో కోటలోని జూనియర్ మహిళా కళాశాలలో నలుగురే చేరారు. ప్రభుత్వ నిర్ణయం కాబట్టి అమలు చేయాలనే నిశ్చయంతో అధికారులు అమలు చేశారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు ఆలస్యంగావిడుదలఅయ్యాయి. మండలంలోపదోతరగతిచదవినవిద్యార్థులు, గూడూరు, నాయుడుపేట, నెల్లూరువంటిప్రాంతాల్లోచేరిపోయారు .

# మురుగు ముప్పు.. ఏదీ కనువిప్పు



కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

మురుగు పోయే దారిలేక ఉన్న కాలువలు సరిగా లేక.. నెలల తరబడి ఒకే చోట కాలువలోనే మురుగు నిలిచిపోతోంది. ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండటంతో స్థానికులు నిత్యం దోమలతో సహవాసం చేయాల్సి వస్తోంది. దీంతోరోగాలబారినపడుతున్నామని వాపోతున్నారు.. కోటలోని దాదారాయి గుంట వద్ద నుంచి పోయే మురికి కాలువ ఇళ్ల సందుల్లో నుంచి పోవాల్సి ఉంది కాస్తా ఆ కాలువ పిచ్చి మొక్కల తో నిండిపోయింది. దీంతో డ్రైనేజీ అంతా దాదారాయి గుంటవద్ద నిలిచిపోతోంది. దీంతో దుర్గంధమైన వాసనతో ప్రజలు విలవిలాడుతున్నారు. ముక్కులు మూసుకొని ఆప్రాంతంలో నడవాల్సి వస్తోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ,అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు దాదాపు ప్రతి సారి స్దానిక సంస్థల ఎన్నికల్లో డ్రైనేజీ నిర్మాణం కోరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందిని నాయకులు ఆర్భాట ప్రకటనలు ఇచ్చి ఎన్నికల అనంతరం ఆసమస్యపై నోరెత్తికపోవడం పై కోట ప్రజలు నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల తీరును తప్పుపడుతున్నారు. పలు సార్లు శాసన సభ్యులు సైతం ప్రజలు ఈ డ్రైనేజి సమస్య చెప్పి ఉన్న ప్రయోజనం ఏమిటిని స్దానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



## శ్రీకృష్ణాష్టమి వేడుకలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:
శ్రీకృష్ణాష్టమి వేడుకలలో తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి హిత్ రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి లోని మురళీకృష్ణ దేవాలయంలో, పన పాకం, అరిగెలవారిపల్లిలో కృష్ణమందిరంలో కృష్ణాష్టమి వేడుక లలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవర ణలో గోపూజ నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరిచు కుని చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులను చేరదీసి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్‌రెడ్డి,జడీపటిసిచిల్లకూరి యుగం ధర్ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకరత్నం, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి,నాయకులు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నరశింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఓంకార్, కొ త్తపాటిమనోహర్‌రెడ్డి,మునికృష్ణారెడ్డి,పాల్గొన్నారు .

## ముత్యాలరెడ్డిపల్లిలో దర్జాగా రోడ్డు స్థలం ఆక్రమణ



–పట్టించుకోని నగరపాలక, రెవెన్యూ సిబ్బంది

తిరుపతిరూరల్, ఆగష్టు19 ప్రభాతవార్త:
వైకుంఠపురం కూడలిలో దర్జాగా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టిన నగరపాలక సంస్థ అధికారులు గానీ రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ముత్యాలరెడ్డిపల్లి వైకుంఠపురం కూడలి నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ప్రదేశం. ఉదయం వేళలలో దినసరి కూలీలతో కూడలి రద్దీగా ఉంటుంది. ఆదే కూడలి గుండా తిరుపతిరూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాలతో పాటు ఇతర రాష్ట్రాల కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వాహనాలు కూడా ఇదే దారిన రాకపోకలు సాగిస్తుంటారు. ఎల్లవేళల రద్దీగా ఉండే ప్రదేశంలో ఓ మద్యం బార్ కూడా ఉండటంతో ద్విచక్రవాహనాలతో పాటు నాలుగు చక్రాల వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ మరింత జఠిలంగా తయారైందని వాహన చోదకులు, పాదాచారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకుంఠపురం కూడలిలో టర్నింగ్‌లో అనాధికారికంగా ప్రభుత్వ స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడంతో స్కూల్ బస్‌లు, పెద్ద వాహనాలు మళ్లింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముత్యాలరెడ్డిపల్లి పరిధిలో నిత్యం రద్దీగా ఉండే వైకుంఠపురం కూడలిలో యదేచ్ఛగా గోడ నిర్మించిన ఇటు నగరపాలక సంస్థ అధికారులు, అటు తిరుపతి అర్బన్ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వెనక అంతర్యం ఎమిటో అర్ధం కావడం లేదు. ట్రాఫిక్ జఠిలం దృష్ట్యా నగరపాలక సంస్థ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి, అనధికారి గోడను తొలగించాలని కోరుతున్నారు.

## గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు పెంచడంతో పాటు పెండింగ్ జీతాలను ఇవ్వాలి : ఎఐటియుసి నేతల డిమాండ్



నారాయణవన ం, ఆగస్టు 19 ప్రభాతవార్త :
స్వచ్ఛభారత్ పథకంలో గ్రీన్ అంబాసిడర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పెండింగ్‌లో వున్న పదినెలల జీతంతో పాటు పెంచిన 21వేల రూపాయాల జీతాన్ని అందించాలని జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నారాయణవనం మండలంలో ఆశాఖ మండల కార్యదర్శి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లోని చెత్తలను ఉదయం లేచిన వెంటనే తొలగిస్తూ వుంటూ వారికి ప్రతినెల సక్రమంగా ఇవ్వాలని జీతాన్ని ఇవ్వకుండా పది నెలల వరకు పెండింగ్‌లో ఎందుకు వుంచుకుంటారని ప్రశ్నించారు. ఉదయం, సాయంత్రం చెత్తలను తొలగించి ఇంటికి వెలితే పూట గడవడం ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికే వీరికి మిగిలిన కార్మికులకు ఇచ్చే విధంగా 21వేల రూపాయాలను జీతంగా ఇవ్వాలని కోర్టు ఆదేశించిన అమలు పరచకపోవడం దారుణమన్నారు. జిల్లా ఎఐటియు సహాయ కార్యదర్శి ఎన్ శ్రీరాములు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు అందించాల్సిన గుర్తింపుకార్డులను సైతం అందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు 30వ తేది జీతం వస్తుందని, గ్రీన్ అంబాసిడర్లకు కూడా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ అన్నాదొరై, మునిచంద్ర, రవి, సింగయ్య, రమేష్, మీనాక్షి, మణిమేఘల, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుని ఊహాచిత్రాన్ని విడుదల చేసిన పోలీసులు

నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త :
మండలంలోని ఎరికంబట్టు పంచాయతీ పరిధి సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ఉత్తర భాగంలోని ఓ బావిలో ఈనెల 3వతేది మృతదేహాన్ని ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన విషయం విధితమే. అయితే హత్యకు గురైనా వ్యక్తిని ఇప్పటి వరకు ఎవ్వరు గుర్తు పట్టకపోవడంతో స్థానిక పుత్తూరు రూరల్ సిఐ ఎం సురేష్‌కుమార్, ఎస్ఐ పరమేష్‌నాయక్‌లు మృతుని యొక్క ఊహాచిత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మృతుని ఆనవాళ్లను వెల్లడించారు. వయస్సు 18నుంచి35 సంవత్సరాలు, ఎత్తు 5.2, కుడి తొడ, కుడి చేతిపై మానిన పాత గాయాలు, వక్క కలర్ ఫుల్ అండర్ వేర్, కుడి చేతికి దారం, నడుముకి రెండు పేటల మొలతాడు వుందన్నారు. సమాచారం కోసం పుత్తూరు రూరల్ సిఐ 9440900010, ఎస్ఐ 9440900693 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.



## ఘనంగా వడ్డె వెంకట్ జన్మదిన వేడుకలు!

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 19 ప్రభాతవార్త:




తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగమయిన 'వడ్డెర సాధికార సమితి' రాష్ట్ర కన్వీనర్,ప్రముఖ పారిశ్రామికవేత్త వడ్డె వెంకట్ జన్మదిన వేడుకలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా తిరుపతి జీవకోనలోని 'వడ్డెర సంఘం' కార్యాలయం నందు వడ్డెర సాధికార సమితి కన్వీనర్ కోనంగి శ్రీరాములు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టిడిపి కార్యకర్తలు,నాయకులు సంబరాలు జరుపుకున్నారు.కార్యక్రమంలోతిరుపతినియోజకవర్గంలోని వడ్డెర కులస్తులతో పాటు వల్లెపు లక్ష్మీపతి,చల్లా సుధాకర్,కోనంగి రాజ్యలక్ష్మి,నారాయణమ్మ, రామయ్య,గుణశేఖర్,మోహన్,తదితరులు పాల్గొన్నారు.



భారత సర్వోన్నత ప్రధాన న్యాయ మూర్తి ఎన్.వి రమణని సన్మానిస్తున్న డాక్టర్ ఆర్. సుధారాణి ప్రభాతవార్త. తిరుపతి నగరం



అడుగడుగునా గాంధీ అడుగుజాడల సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం చేసేందుకుపాదయాత్రచేస్తున్నతమిళనాడుతిరుచ్చిప్రాంతానికిచెందినకరుపయ్య

## తొట్టంబేడు అధికారులతో ఆర్డీవో సమీక్ష

తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త



తొట్టంబేడు తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, సర్వేయర్ రవి శేఖర్, ఆర్ఐ ధనంజయులుతో శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా మండలంలో భూసమస్యలపై ఆరాతీయడంతో పాటు తొట్టంబేడు మండలం పరిశ్రమల కేంద్రంగా ఉందని తెలుసుకున్న ఆర్డీవో మండలంలో గ్రీన్‌ప్యానెల్, కజారియా, ఆక్సోరా పరిశ్రమలు ఉన్నాయని తహశీల్దార్ ఆర్డీవోకు తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. మండలంలో రీసర్వేకు సంబందించిన అంశాలతో పాటు ఎన్ని గ్రామాల్లో సర్వేపూర్తయింది, ఇంకా ఎన్ని గ్రామాలు పూర్తికావాలో తెలుసుకున్నారు. ఇక ఎపిఐఐసికి ఎంత భూములు ఇచ్చారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? పరిహారం ఇంకా ఎంతమందికి రావాలి అన్న అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఆరులైన్ల రహదారికి సంబంధించి కూడా వివరాలు తెలుసుకుని పరిహారాలపై తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. భూసేకరణ ఇంకా ఏమైనా చేపట్టాలా అన్న అంశాలపై చర్చిస్తూ ఇప్పటికే విసిఐసికి సంబంధించి భూసేకరణ చేశామని రైతులతో చర్చించామని పరిహారాలు కూడా అందాయన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో ఆదేశించారు. సమావేశంలో డిఐ గురవయ్య, సర్వేయర్ రవిశేఖర్, ఆర్ఐ ధనంజయులు, సచివాలయ సర్వేయర్ రాఘవ తదితరులు ఉన్నారు.

## సుకన్య సమృద్ధి యోజనకు రూ.2.50లక్షల విరాళం

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త



యువనాయకుడు సామానుశ్రీధర్ రెడ్డి తన దాతృత్వాన్ని సేవాగుణా న్ని మరోసారి చాటుకున్నారు. శ్రీకాళహస్తి, కెవిబిపురం, బుచ్చినా యుడు కండ్రిగ మండలాలకు సం బందించిన సుకన్య సమృద్ధి యోజ న పథకం కింద శుక్రవారం మొద ట విడత ఆయన ఒక్కొక్క బాలిక కు రూ.250లు వంతున వెయ్యిమందికి రూ.2.50లక్షలు చెల్లించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈసొమ్మును శ్రీకాళహస్తి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మణిగండన్‌కు అందించారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, వాసుదేవ, అనుతరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముఖహాజరు వేయడంపై ఎపిటిఎఫ్ నిరసన

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ల ద్వారా ముఖహాజరు వేయమన డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని జిల్లా ఎపిటిఎప్ అధ్యక్షు డు బి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఎపిటిఎప్ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి డివిజన్ సమావేశం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమా నికి తిరుపతి జిల్లా అధ్యక్షులు బి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం, మరియు శ్రీకాళహస్తి, గ్రామీణ, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, కెవిబిపురం, వరదయ్యపాళెం, రేణిగుంట, సత్యవేడు, వడమాలపేట మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఆడిట్‌కమిటీ పూర్వసభ్యులు జి.సుధాకర్‌లు హాజరయ్యారు.ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే వివిధ రకాల యాప్‌లతో ఉపాధ్యాయులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక విద్యార్థులకు చదువు ఎప్పుడు చెప్పాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపిఎస్ విదానాన్ని అమలుచేయాలని, మంత్రుల కమిటీ రెండు రోజులక్రితం సిపిఎస్ కంటే ఓపిఎస్ విధానం మేలని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి కయ్యూరుబాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఎపిటిఎప్ పోరుబాట 100రోజుల కార్యనరకమంలో భాగంగా ఈనెల 25న విజయవాడలో జరిగే రిలేనిరాహారదీక్షకు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీచేయుచున్న ఎల్‌సి.రమణారెడ్డి హాజరై తమకు రాబోవు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విఎస్ఎస్.ప్రసాద్, బిఎన్.మునిరాజ, రామదాసు, ఈశ్వరయ్య, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాములవారి మందిరానికి వితరణ

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని ఎగువ వీది పంచాయతీలోని మిట్టవీది శ్రీరామమంది రానికి రూ.30వేలు విలువ చేసే మెటీరియ ల్‌ను మాజీ రాచగున్నేరి సర్పంచ్ బొల్లినేని జగన్నాధం నాయుడు శుక్రవారం అందిం చారు. ఇక్కడ శ్రీరామమందిరంను గ్రామస్తు లు నిర్మించుకుంటున్నారు. ఈ మందిరానికి విరాళాన్ని నిర్వాహకులు జగన్నాధం నాయుడును కోరారు. ఆయన తన సొంత దుకాణం నుంచి నిర్మాణానికి అవసరమైన స్టీల్‌ను అందించారు

## కారాకొల్లు పంచాయతీలో బాదుడే..బాదుడు..

తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్య క్షుడు నారాచంద్రబాబు నాయు డు ఆదేశాలతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీ ర్‌రెడ్డిసూచనల మేరకు మండ లం లోని కారాకొల్లు పంచాయ తీలో రాష్ట్రకార్యదర్శి గాలి చల పతి నాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు గాలిమురళీ నాయు డుల ఆధ్వర్యంలో బాదుడే.. బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబా బునాయుడు పాలనలో, జగన్‌రెడ్డి పాలనలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికి పంపిణీచేశారు. గ్రామంలోని మహిళలు తమ పంచాయతీలో పరిశ్రమలు పెట్టి తమ పొట్టకొట్టడమే కాకుండా ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్యాక్టరీల్లో ఆయా గ్రామాల్లో ఉన్న వారికి 75శాతం ఉద్యోగాలు ఇస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి నేటికి స్థానికులకు మొండిచేయి చూపుతున్నారన్నారు. వరవకాలువను సైతం ఆక్రమించుకుని ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నారెవెన్యూ అధికారులు కూడా స్పందించకపోవడం, ప్రతి నిత్యం వార్తల్లో వస్తున్నా అధికారుల్లో చలనం లేకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డులు, ఫించన్లు దశలవారీగా తొలగించడం జగన్ ప్రభుత్వానికే చెల్లుతుందని ఒక్క ఛాన్స్ అన్న పేరుతో తామంతా మోసపోయారని రాబోవు ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి తగిన బుద్దిచెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణమనాయుడు, శ్రీధర్‌నాయుడు, వెంకటేష్, శంకర్‌రెడ్డి, రామరత్నం, వెంకటరమణ, రమేష్, చంద్రారెడ్డి, బయ్యారెడ్డి తదితర నాయకులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# అనుబంధ ఆలయాలను మరుస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న చిన్న ఆలయాల నిర్వహణను ఆలయాధికారులు మరచిపోతున్నారు.ఈ నేపథ్యంలో ఈ ఆలయాలకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేప థ్యంలో శుక్రవారం కృత్తిక కావటంతో ఆడికృత్తికకు మొక్కులు తీర్చుకో లేని భక్తులు తీర్చుకొనుటకు వచ్చారు.అయితే ఈ అంశం అధికారు లకు కూడా ఎరుక. కానీ ఎందుకో ఇక్కడ పర్యవేక్షణను గాలికి వదలిపెట్టారు.ఆడికృత్తికకు వేలాది మంది మొక్కులు తతీర్చుకోవటం ఆనవాయితి. అయితే అపుపడు రాలేని వారు తరువాత వచ్చే కృత్తిక సందర్బంగా హాజరై పూజలు నిర్వహించటం తలనీలాలు సమర్పిం చటం జరుగుతుంది.ఈ నేపధ్యంలో శుక్రవారం అధిక సంఖ్యలో



భక్తులువచ్చారు.కానీనారదపుష్కరిణిలోభక్తులకుకావాల్సిన సదుపా యాలు కల్పించలేదని హిందూధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్ శివమెత్తారు.పుష్కరిణిలో నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లు తుండగా కనీసం ఆ నీటిలో కూడా స్నానమాచరించటానికి తగిన సదుపాయాలు కల్పించలేదని ధ్వజమెత్తారు. అయితే ప్రత్యామ్నా యంగాఇక్కడ పంపులు ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాల్సి ఉండగాపట్టించుకోలేదనివిమర్శించారు.ఇకమహిళాభక్తులు స్నానమా చరింటానికి బట్టలుమార్చుకోవటానికి డ్రస్సింగ్ గదులు లేకపోవటం తో తిప్పలు పడ్డారు. ఆలయ ఆదాయాలు నెల నెల పెరుగుతు న్నాయని చెబుతున్న అధికారులకు భక్తులకు కనీస సదుపాయాలు కల్పించాలనేగుర్తింపులేకపోవటంపరిపాలనలో పారదర్శ కతకు నిదర్శనం.రమేష్‌తో పాటు సభ్యులు మద్దు వాసుయాదవ్, పుణ్యం ఢిల్లికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

వడమాలపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త:



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలోని ప్రజలు శుక్రవా రం ఘనంగా జరుపుతున్నారు. వడమాలపేట మండలం శ్రీ బొమ్మరాజపురంలోవెలసినశ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయం లో వేకువ జామున నుంచి వివిధ సుగంధ ద్రవ్యాలతో, ధూప దీపనైవేద్యాలతో గ్రామ ప్రజల చేత స్వామివారికి పాలాభిషేకం జరిగింది.అనంతరంప్రత్యేక పుష్పాలతో స్వామివారిని సర్వంగా సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించి మొక్కులు తీర్చుకున్నా రు. తదుపరి కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు గ్రామ పంచాయతీలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మణిరాజు, ఆలయ కమిటీ సభ్యులు యాదగిరిరాజు, సత్యనారాయణరాజు, భాస్కర్‌రాజు, కృష్ణమరాజు, చెంగల్రాజు, సామయ్య, సుధాకర్, ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేణిగుంట అర్బన్ ఎస్ఐగా ప్రతాప్

రేణిగుంట, ఆగస్టు 19 ప్రభాతవార్త:



రేణిగుంట అర్బన్ ఎస్ఐగా ప్రతాప్ శుక్రవారం పదవీ బాధ్యత చేపట్టారు. ఆయన స్థానంలో ఉన్న సునీల్ బదిలీపై కేవీబీ పురం వెళ్లారు. కేవీబీ పురం నుంచి ప్రతాప్ రేణిగుంటకు బదిలయ్యారు. కర్నూలు జిల్లా పులిచెర్లకు చెందినఆయన 2022 బ్యాచికి చెందినవారు. సత్యవేడు, నాగలాపురం, కేవీబీ పురంలలో పని చేసిన అనుభవం ఉంది. శ్రీవారి ముఖ ద్వారమైన రేణిగుంట అర్బన్‌స్టేషన్‌లోపనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ ప్రోటోకాల్‌కు భంగం వాటిల్లకుండా, శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు.

## ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి సుఖసంతోషాలతో మెలగాలి

కేవీబీ పురం, ఆగస్టు 19 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో ప్రధానోపాధ్యా యులు కీర్తి శేషులు కొప్పేడు ముత్తయ్య, ధనరా జమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారులు, కుమార్తె బంధువులు కలసి నిర్మించిన క్రీస్తు సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. అనంతరం ఫాస్టర్లు క్రిస్టఫర్ సుధీర్ ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవ సోదరులందరికి కీర్తి నామ సంకీర్తనలతో అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి సుఖ సంతోషాలతో శాంతియుతంగా మెలగాలని ఆయన కోరారు. ముత్తయ్య కుమారులు, కుమార్తెలు వంశ వృక్షం వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని ఎమ్మెల్యే క్రీస్తు సంఘంలో చర్చకు వచ్చి అందరిని ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యేను క్రైస్తవ సోదరులందరూ శాలువలతో, పూలమాలలతో సన్మానించారు. 500 మందికి విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర హిస్టరీ అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, రాష్ట్ర మహిళా సంఘం డైరెక్టర్ వసంత లాల్‌బాబుయాదవ్,మండలఎంపీపీమునిలక్ష్మి,నందకుమార్,సంఘంనాయకుడు అగ్రహారం హరిబాబురెడ్డి, కె.గిరి,ఎంపీటీసీఅయ్యప్పరెడ్డి,వైసీపీనాయకులుమహిళాసంఘం నాయకులు బుర్ర మాధవరెడ్డి, రమాప్రభ, పర్వతాల బాలసుబ్రహ్మణ్యం, పాస్టర్లు క్రిస్టఫర్ సుధీర్, శాంత నాగరాజ్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కేవీబీ పురం, ఆగస్టు 19 ప్రభాతవార్త:
కేవీబీపురంమండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం గోకులాష్టమి సందర్భంగా దిగువపుత్తూరులోని శ్రీకృష్ణ దేవాలయంలో,కళత్తూరు, అంజూరు, ఎంఏ రాజులకండ్రిగ గ్రామాల్లోని శ్రీరామ మందిరాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలుఘనంగానిర్వహించారు.ఆలయాల్లోపూజలు, అభిషేకాలు చేసి భజనలతో ప్రార్థనలతో ఆలయాలు మారుమోగాయి.

## వైసిపి పాలనలో పన్నులతో ప్రజలకు వాతలు గాలి భానుప్రకాష్

పుత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త :



వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలకు కోతలు విధించిందని అదే సమయంలో వివిధ రకాల పన్నులతో ప్రజలకు వాతలు పెడుతోందని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ ఆరోపించారు. శుక్రవారం పుత్తూరు మునిసిపాలిటీలోని ఎన్టీఆర్ కాలనీలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే ఆర్థిక భరోసా ఇచ్చేందుకు టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా అమలు చేసి వందల కోట్ల లబ్ధిదారులకు అందిస్తే...ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం దాని పేరు మార్చి కుటుంబంలో ఒకరికి మాత్రమే బీమా పరిమితం చేసి అరకొర సాయం చేస్తోందని తెలిపారు. ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చి అప్పుల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ ఏడాదిలో కేవలం అయిదు నెలల్లో 44,000 కోట్లు అప్పులు తెచ్చి ఆ భారాన్ని ప్రజలపై మోపారని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్త రాము కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



విజయపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త :
మండలంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చెంగమనాయుడు కండ్రిగలో కోలాటంతో శ్రీకృష్ణుని ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరిం చి పూజలు చేసి అన్నదానం నిర్వహిం చారు. పాతార్కాడులో వీధుల్లో విద్యు త్ దీపాలతో అలంకరించి శ్రీకృష్ణుడిని పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో యువకులు ఆనందోత్సా హాలతో ఉట్టి కొట్టారు. మండలంలో మహారాజపురం, శ్రీహరిపురం, విజయపురం, కోసలనగరం, తెల్లగుంట, పోతురాజులుకండ్రిగలో స్థానికులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకున్నారు.

## రేపు పన్నూరులో ఉచిత వైద్య శిబిరం

విజయపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త :
ఈ నెల 21వ తేదీన ఉదయం తొమ్మిది గంటలకు మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో పివి హైస్కూలు ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తిరుపతి రోటరీ క్లబ్ ఛైర్మన్ డాక్టర్ కె.వి.చలపతి తెలిపారు. శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి తిరుపతి వారి సహకారంతో నిర్వహిస్తున్నామని, పుత్తూరు కెకెసి హోమియో కాలేజీ సహకారంతో హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వాడ వాడల్లో గోకులాష్టమి: పాల్గొన్న ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని వాడ వాడల్లో గోకులాష్టమి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయానికి సంబంధించి భిక్షాల గాలిగోపురం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన సప్తగోకులంలో గోకులాష్టమి పూజలకు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి పాల్గొని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు.గోవులకు పూజలు నిర్వహించి గోమాతలకు ఆహారాన్ని అందించారు. ఇక్కడే ఉన్న కృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు సాధనమునస్వామి,జయశ్యాం రాయల్, ప్రత్యేకాహానితులు చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు, పవన్, ఆలయ ఎసి మల్లికార్జున్ గోశాల ఇన్‌చార్జి రాజశేఖర్, బాలాగౌడ్, ధన, కళ్యాణ్, తేజ,ప్రసద్ తదితరులు పాల్గొన్నారు.కాగా బంగారమ్మకాలనీలోని కృష్ణమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే..'జనవాణి'..!

**-జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 19 ప్రభాతవార్త: వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయడానికే తమ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ 'జనవాణి' కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్,తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు ఈ మేరకు నేతలతో కలిసి 'జనవాణి'కి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 20,21 తేదీలలో నెల్లూరు,రాయలసీమ జిల్లాలలో 'జనవాణి' సభలు నిర్వహిస్తున్నామని అన్నారు.సాక్షాత్తూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సొంత ఊరు పులివెందులలో 14 మంది,అలాగే కడప జిల్లాలో 175 మంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తన స్వంత జిల్లాలో ఇంతమంది రైతులు చనిపోయినా కనీసం వారిని పరామర్శించిన పాపాన పోలేదని మండిపడ్డారు.అదే తమ జనసేనాని పవన్ తన స్వంత నిధులను వారికి విరాళంగా ఇచ్చి ఆదుకోబోతున్నారని హర్షం వ్యక్తంచేశారు.ఇప్పటి వరకు రాష్ట్రంలో లెక్కలేనంత మంది కౌలు రైతులు చనిపోతే..కనీసం ఆ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు ఒక్కరైనా తమ స్వంత డబ్బులిచ్చి ఆదుకున్నారా అని ప్రశ్నించారు.ఈ రాక్షసరాజ్యంలో జనం పడుతున్న కష్టాలను 'జనవాణి'లో ప్రజలు వినతిపత్రాల ద్వారా తెలపవచ్చన్నారు.తిరుమల,తిరుపతితో పాటు రాయలసీమ జిల్లాలలో బడి,గుడి,ఇతర ఏసమస్యలున్నా అర్జీల రూపంలో అందచేయాలని వారు పిలుపునిచ్చారు.20వ తేదీ శనివారం కడప జిల్లా పర్యటన ముగించుకుని,21వ తేదీ ఆదివారం 150 బైపాస్‌లోని బాలాజి డైరీ ఎదురుగా ఉన్న జిఆర్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు ఉదయం 8-30 గంటలకు జనవాణి సభ నిర్వహిస్తారని వారు వివరించారు.అదే రోజు ఉదయం స్థానిక తాజ్ హోటల్ నుండి కన్వెన్షన్ సెంటర్ వరకు పవన్‌కళ్యాణ్‌తో కలిసి జనసైనికులు భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో జనసైనికులు రాజారెడ్డి,బత్తిన మధుబాబు, ఆకేపాటి సుభాషిణి,లక్ష్మి,పార్థు,కొండా రాజమోహన్,రవి,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్‌కు మార్గం సుగమం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 19 ప్రభాతవార్త: కర్ణాటకలోని మైసూరు నుంచి తమిళనాడులోని చెన్నై వరకు 475 కిలోమీటర్ల బుల్లెట్ ట్రైన్‌కు మార్గం సుగమమైనట్టు కర్ణాటక మంత్రి సోమన్న తెలిపారు. బెంగుళూరు నుంచి తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో బైరెడ్డిపల్లెల విలేకరులతో మాట్లాడారు. గతంలో ఢిల్లీ నుంచి వారణిశికి, ముంబాయి నుంచి కలకత్తాకు బుల్లెట్ ట్రైన్లు నడుస్తున్నాయని తెలిపారు. కొత్తగా ఇప్పుడు ఈ మార్గంలో బుల్లెట్ ట్రైన్ మార్గం సిద్ధమయిందని తెలిపారు. అందుకు కావాల్సిన టెండర్లు పిలిచామని, ఆ టెండరు ఖారురు చేశామని చెప్పారు. బుల్లెట్ ట్రైన్ వెళ్ళడానికి రైలు మార్గం నిర్మాణానికి భూ సేకరణ వెంటనే జరపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట, బైరెడ్డిపల్లె మండలం తీర్థం, బైరెడ్డిపల్లె, కీలతొరిడి, పలమనేరు మండలం కొలమాసనపల్లి, మాదిగబండ, గుడిపాల మండలాల మీదుగా బుల్లెట్ ట్రైన్ తమిళనాడులోకి ప్రవేశిస్తుంది, ఈ మార్గం కోసం ఆయా మండలాల తహశీల్దార్లు భూ సేకరణలో నిమగ్నమయ్యారు.

## ఎస్వీయూకు ఐఎస్ఓ గుర్తింపు

తిరుపతి (క్రీడా), ఆగస్టు 19, ప్రభాతవార్త : రాష్ట్రంలో 66 సంవత్సరాలుగా అత్యున్నత ప్రమాణాలు గల విద్యనందిస్తున్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించడంతో ఉపకులపతి ఆచార్య కె. రాజా రెడ్డి ఆనందం వ్యక్తం చేసారు. గత నెలలో హైదరాబాద్‌కు చెందిన ఐఎస్ఓ బృందం మూడు రోజుల పాటు ఎస్వీయూను సంపూర్ణంగా పరిశీలన చేసింది. బృందం సభ్యులు టీములుగా వివిధ శాఖలను పరిపాలనా భవనాన్ని విద్యా ప్రమాణాలను, అవస్థాపన సౌకర్యాలను కుణ్ణంగా పరిశీలించారు. శుక్రవారం ఐఎస్ఓ ప్రతినిధి శివయ్య, విసి ఆచార్య కె. రాజారెడ్డిని కలసి ధ్రువీకరణ పత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఎస్వీయూ చరిత్రలో ఐఎస్ఓ నంబర్ పొందడం చిరస్మరణీయ అధ్యాయమన్నారు. మనకు అన్ని సౌకర్యాలు వున్నాయని ఐఎస్ఓ బృందం నిర్ధారణ చేసి సర్టిఫికేట్ ఇవ్వడం ఆనందంగా వుందన్నారు. ఈ సందర్భంగా న్యాక్ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మన ఎస్వీయూకు ఐఎస్ఓ బృందం నాలుగు విభాగాల్లో ఉన్నత ప్రమాణాలు వున్నట్లు నిర్ధారించిందని, విశ్వవిద్యాలయ పరిపాలన, జెండర్ సెన్సివిటీ, ఎనర్జీ సేవింగ్, గ్రీనరీ, ఎన్విరాన్ మెంట్ సేవింగ్ అనే విభాగాల్లో ఐఎస్ఓ నెంబర్ ఇచ్చినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఉపకులపతి ఆదేశానుసారం ఎస్వీయూ ఐఎస్ఓ పరిశీలనకు వెళ్లిందని అన్ని విభాగాల్లో గుర్తింపు రావడం ముదావహమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య గాలి రాధాకృష్ణ, డా. నరసింహ, డా. సరిత తదితరులు పాల్గొన్నారు.

## పెద్దశేషవాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు



నారాయణవనం, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలోని భీమునిచెరువు గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణుని జన్మష్టమిని పురస్కరించుకొని రాత్రి 7గంటలకు పెద్దశేషవాహనంపై గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగారు. ఉదయం మహిళా భక్తులు ఆలయం ఎదుట పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించుకున్నారు. మధ్యాహ్నం యువకులు ఉట్లోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. రాత్రి రాధా రుక్మణీ సమేత వేణుగోపాలస్వామిని పెద్దశేషవాహనంపై అధిరోహించి పుష్పాలతో సర్వంగా సుందరంగా అలంకరించి ఊరేగించారు. అలాగే సముదాయం, నారాయణవనం, తుంబూరు, పాలమంగళం, నైనారుకండ్రిగలో శ్రీకృష్ణుని జన్మష్టమి సందర్భంగా విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్సియల్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, నారాయణవనం, భీమునిచెరువు సర్పంచులు కెజి శారదమ్మ గణేషన్, వి.మురుగేశం, దాతలు రామలక్ష్మణన్‌లు, మాజీ సర్పంచ్ సుధాబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ దోమల దినోత్సవం

**- పోస్టర్‌ను విడుదల చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి**

తిరుపతి నగరం, ఆగస్టు 19 ప్రభాతవార్త : ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ దోమల దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమల ద్వారానే మనుషులకు మలేరియా వ్యాధి వస్తుందని ప్రముఖ వైద్యుడు శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ 1897, ఆగష్టు 20న ఒక దోమ యొక్క జీర్ణాశయాంతర ప్రేగు గోడలో మలేరియా పరాన్నజీవి వలన మలేరియా వ్యాధి వస్తుందని కనుగొన్నారని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఆగష్టు 20న ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పోస్టర్‌ను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. ఇంట్లోకి దోమల రాకుండా, మన చుట్టు ప్రక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మనిషి రోగాల భారీన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి, తిరుపతి డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## రాస్ మునిరత్నం సేవలు శ్లాఘనీయం : సిజె జస్టీస్

తిరుపతి,ఆగస్టు 19ప్రభాతవార్త : బడుగు,బలహీన వర్గాల ప్రజలకు, మహిళలకు, రైతులకు తనవంతు సేవలందించాలనే దృక్పధంతో రాష్ట్రీయ సేవాసమితి (రాస్)సంస్థను గుత్తా మునిరత్నంనాయుడు స్థాపించారని,ఆయన అందించిన సేవలు శ్లాఘనీయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ ఎన్‌వి రమణ అన్నారు. అన్ని వర్గాల వారికి తోడుగా ఉండాలని రాస్ సంస్థను ఆయన స్థాపించారన్నారు. రాస్ ప్రధాన కార్యాలయంలో గుత్తామునిరత్నం విగ్రహాన్ని జస్టీస్ ఎన్‌వి రమణ ఆవిష్కరించారు. రాస్ ముద్రించిన సేవా ప్రస్థానం పుస్తకాన్ని జస్టీస్ ఎన్‌వి రమణ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణునికి వేదమంత్రోచ్ఛరణలతో పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పట్టణానికి సమీపంలోని చెంచు లక్ష్మి కాలనీలో అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణాలయంలో అష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలు సి.చెంచురత్నం కుటుంబం సభ్యులు స్వామివారి పుష్ప యాగాన్ని నిర్వహించారు. అర్చకులు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రోచ్ఛరణలతో శ్రీకృష్ణున్ని అర్చిస్తూ పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం నాయకులు సి.చెంచురత్నంయాదవ్, విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్.చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, ఇర్ల.లోకేష్‌యాదవ్, కె.చంద్రశేఖర్, చంద్రయ్య, డాక్టర్ వి.కృష్ణయ్య, చిర్రి.నాగేశ్వరరావు, మేకల జయరాం, నారాయణయాదవ్, గోపాల్ యాదవ్, రామకృష్ణయాదవ్, లోకేష్‌యాదవ్, దశరథయ్య, రమణయ్య, వెంకటాచలం, గురుస్వామి, మునిరాజ, మణి, కృష్ణ, వెంకటాచలంతో పాటు పలువురు యాదవసంఘ నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన చిన్నికృష్ణులు, గోపికలు



శ్రీకాళహస్తి ఆగస్టు 19 ప్రభాతవార్త : శ్రీకృష్ణాష్టమని సందర్భంగా పట్టణంలో వెలసిన శ్రీకృష్ణమందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న శ్రీకృష్ణమందిరం, బంగారమ్మ కాలనీలో ఉన్న శ్రీకృష్ణమందిరం, శ్రీకాళహస్తీశ్వరాలయం భరద్వాజతీర్ధంలో వెలసిన సప్తగోకులమందిరాలు భక్తులతో కళకళలాడాయి. పలువురు చిన్నారులు అబ్బురపరచారు. పట్టణానికి చెందిన చిన్నారి హయాతీ చిన్నికృష్ణుని వేషధారణలో చక్కగా అలరించి అందరి ప్రశంసలు అందుకుంది.

# దిక్కులేని టిటిడి ఆలయం

కార్వేటినగరం,ఆగస్టు 19 ప్రభాతవార్త: తిరుమల-తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న శ్రీరుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం గోకులాష్టమి సంధర్భంగా మామిడాకులకు కూడా నోచుకోలేదని కిసాన్‌మోర్చ అధ్యక్షులు నడింపల్లి యువరాజు విమర్శించారు. గోకులాష్టమికి సంస్థానాధీశుల కాలం నాటినుండి పూజలు చేస్తుండేవారు. గోకులాష్టమికి మామిడాకులు కట్టలేదు,పువ్వులు అలంకరించలేదు, అరటిమానులు కట్టకపోవడంతో ప్రజల మనోబావాలను దెబ్బతీసే విధంగా టిటిడి అధికారులు నడుచుకుంటోందన్నారు. తెల్లవారిజామున చేయాల్సిన అభిసేకాలు ఉదయం 11.30గంటల తరువాత చెయ్యడానికి ఉపక్రమిస్తున్నారన్నారు. ఆలయంలో అధికారులు లేదన్నారు. ఎఇకు ఫోన్‌చేస్తే ఇప్పుడే మాట్లాడుతా నంటున్నారన్నారు. టెంపుల్ ఇన్స్‌పెక్టర్ కనపడలేదన్నారు. ఆలయంలోని అర్చకులను అడిగితే గతంలో చేసిన వాటికి ఇంతవరకు బిల్లులు రాలేదని,ఇంక ఇప్పుడేం చేస్తామని తేల్చి చెప్పారు. గోకులాష్టమికి ఒకసంవత్సరంకు ఒకసారి జరగాల్సిన నిత్యం నైవేద్యాలకు దిట్టం లేదన్నారు. టిటిడిబోర్డు, ప్రభుత్వం ఏం చేస్తా వుందని ఆయన ప్రశ్నించారు. ఇంతవరకు ఇలాంటి సన్నివేశాన్ని ఆలయంలో చూడలేదన్నారు. టిటిడి యాజమాన్యం కార్వేటినగరం ఆలయాన్ని పట్టించుకోకపోవడంతో వేణుగోపాలస్వామి ఆలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆలయాన్ని భ్రష్టుపట్టిస్తు న్నారని భక్తులు వాపోయారు. సిబ్బందిలేదు,మామిడాకులు లేదు,అరటిమానులు కట్టే దిక్కులేదు. గతంలో వందలసంఖ్యలో పశువులకు పూజలు చేసేవాళ్ళని గుర్తు చేశారు. మంత్రి నారాయణస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న జిడినెల్లూరు నియోజకవర్గంలో అతిప్రాచీన దేవాలయమన్నారు. కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయ సిబ్బందిలో స్థానికులకు స్థానచలనం కల్పిస్తే తప్ప ఆలయం బాగుపడదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. గతంలో గోకులాష్టమి రోజున బొబ్బిలిదొరతో నాట్యం జరిగేదని,పెద్దపండుగ వాతావరణం, వందలసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యేవారు. ఈ సమస్యలన్నీ టిటిడి దేవాలయ అధికారులకు విన్నవిస్తూన్నామన్నారు. గోకులాష్టమి రోజున స్వామివారిని పట్టించుకోని సిబ్బందిపై కఠినచర్యలు తీసుకోవాలని భక్తులు సుబ్రమణ్యం, మునిరత్నంరెడ్డి, రాజేష్,సావిత్రమ్మ,భక్తులు పాల్గొన్నారు.

### మామిడాకులకు నోచుకోని గోకులాష్టమి!



ఆలయాన్ని పట్టించుకోలేదని చెబుతున్న భక్తులు దృశ్యం

## కాణిపాకంలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు

**-గోశాలలో వైభవంగా గోపూజ : ఉట్టికొట్టిన ఈఓ**



కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త: శ్రీగోకులాష్టమి వేడుకలను కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకంలో ప్రతి ఏటా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈవేడుకలను దేవస్థానం గోశాలలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ఎం.మోహన్‌రెడ్డి, ఎంవి.సురేష్‌బాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్, రాజేంద్ర యాదవ్, దిగువ తడకరకు చెందిన రేణు గోపాల్‌యాదవ్, దేవరాజులు యాదవ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉత్సవ ఉభయదారులు, ఆలయ ఛైర్మన్, ఈఓ, ఆలయ అధికారులు తదితరులు ప్రధాన ఆలయం నుండి పూజాసామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోశాలకు తీసుకువచ్చారు. అనంతరం గోశాల వద్ద శ్రీకృష్ణుని చిత్రపటంతో పాటు గోమాత చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలోని గోమాతలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్, ఈఓ, వేదపండితులు గోమాతలకు సంప్రదాయబద్దంగా అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతలకు ఈఓ, ఛైర్మన్‌లు ఆలయ అధికారులతో కలసి మేతను అందించారు. అలాగే గోశాల వద్ద ఏర్పాటు చేసిన ఉట్లమాను వద్ద ఈఓ సురేష్‌బాబు ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానంలో అమలవుతున్న గోపూజ కార్యక్రమంను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దీనితో పాటు గోసంరక్షణ నిధికి దాతలు తమవంతు విరాళాలను అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఉత్సవ ఉభయదారులు, భక్తులు,పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీకృష్ణుడికి పుష్పయాగం



శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణునికి వేదమంత్రోర్చరణలతో పుష్పయాగాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పట్టణానికి సమీపంలోని చెంచులక్ష్మికాలనీలో అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణాలయంలో అష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం విశిష్ట పర్వదినమైన శ్రీకృష్ణజన్మష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతమైన పుష్పాలతో పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉభయదాతలు సి.చెంచురత్నం కుటుంబం స్వామివారి పుష్పయాగానికి 100కిలోల పూలను సమర్పించారు. అర్చకులు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రోర్చరణలతో శ్రీకృష్ణున్ని అర్చిస్తూ పుష్పయాగాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలను స్వామి అర్చనకు వినియోగించారు. చివరగా తులసీదళంతో స్వామివారిని అర్చించి పుష్పయాగాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తదనంతరం స్వామివారికి దూప,దీప నైవేద్యాలను శాస్త్రోక్తంగా సమర్పించారు.చివరగా స్వామివారికి విశిష్టమైన పుర్ణాహరతులను వేదమంత్రోర్చరణలతో సమర్పించారు. పట్టణ నలుమూలల నుండి భక్తజనాలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి పుష్పయాగంలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తజనానికి ఆలయం తరపున తీర్థప్రసాదాలను అందించారు. ఉదయం స్థానిక ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర నాయకులు కోలా ఆనంద్‌కుమార్, సిఐ అంజూయాదవ్‌లు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని పురవీధుల్లో అంగరంగవైభంగా నిర్వహించారు. ఈ పుష్పయాగ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం నాయకులు సి.చెంచురత్నంయాదవ్, విక్రమ్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, ఇర్ల.లోకేష్‌యాదవ్, కె.చంద్రశేఖర్, చంద్రయ్య, డాక్టర్ వి.కృష్ణయ్య, చిర్రి.నాగేశ్వరరావు, మేకల జయరాం, నారాయణ యాదవ్, గోపాల్‌యాదవ్, రామకృష్ణ యాదవ్, లోకేష్‌యాదవ్, దశరథయ్య, రమణయ్య, వెంకటాచలం, గురుస్వామి, మునిరాజ, మణి, కృష్ణ, వెంకటాచలంతో పాటు పలువురు యాదవసంఘ నాయకులు పాల్గొన్నారు. కాగా కాత్రపల్లికి చెందిన చిన్నారుల కోలాటాలు నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.

## శబరిమల అయ్యప్ప సేవలో మంత్రి పెద్దిరెడ్డి



చౌడేపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త : కేరళ అయ్యప్ప స్వామిని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకొన్నారు. ఈనెల 18న ఆయనతోపాటు రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జడ్పీ ఛేర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో పాటు మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు కేరళ అయ్యప్పస్వామిని దర్శించుకొన్నారు.

## రాష్ట్రాలు దాటిన 'పెద్దాయన'పై అభిమానం

**- కేరళలో మంత్రి పెద్దిరెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు!!**




కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త : జిల్లా వైకాపా శ్రేణులకు పెద్ద దిక్కు, పెద్దాయనగా ఉన్న రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిపై ఉన్న అభిమానం రాష్ట్రాలు దాటింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, కుప్పం రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ మంత్రి పట్ల తనకు ఉన్న విశ్వాసాన్ని చాటుకున్నారు. శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి అయ్యప్ప దీక్షతో శబరిమలైకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కేరళలో ప్రయాణించే మార్గాల్లో రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ మంత్రి పెద్దిరెడ్డి ఫ్లెక్సీలను పెద్ద ఎత్తున ఏర్పాటుచేశారు. ఎన్నటికీ మీరే మా దేవుడు అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.

## బృందావనమాలి... ముకుందా...మురారీ...!



చౌడేపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త : శ్రీకృష్ణుని జన్మాష్టమిని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుప ుకొన్నారు. స్థానిక శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, షిర్డీసాయిబాబా ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో చూపరులను ఆకట్టు కొన్నారు. మర్రిమాకులపల్లి, చిట్రెడ్డిపల్లిల వద్ద హరేరామ హేరేకృష్ణా వారి ఆధ్వర్యంలో కృష్ణాష్టమిని వేడుకగా జరిపారు.

## ఘనంగా అంతర్జాతీయ ఛాయా చిత్ర దినోత్సవ వేడుకలు




తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 19 ప్రభాతవార్త :అంతర్జాతీయ ఛాయా చిత్ర 184వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నాలుగుకాళ్ళ మండపం వద్ద తిరుపతి, తిరుమల, రేణిగుంట, తిరుచానూరు, చంద్రగిరి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసపాటి మోహనరాజు ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ ఛాయా చిత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మంజునాథ్ హాజరై ఛాయా చిత్ర గొప్పతనాన్ని వివరించారు. అంతకు ముందు ఛాయాచిత్ర పితామహుడు లూయిస్ డ్యాగురే చిత్రపటానికి పూల మాలలు వేసి, కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సీనియర్ ఫోటో గ్రాఫర్స్‌ను శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివశంకర్, సంయుక్త కార్యదర్శి అమర్‌నాథ్, నగర అధ్యక్షులు కిషోర్ కుమార్, కార్యవర్గ సభ్యులు రాజు, సురేష్, హరి, సురేంద్ర, సతీష్, మురళీ, ఫోటోగ్రాఫర్స్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుని పరిణయోత్సవం



పుత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివాలయ ఆవరణలో ఉన్న గీతామందిరం శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గొల్లపల్లి ముద్దుకృష్ణాపురం, గొల్లకండ్రిగ, తిరుమల కుప్పం, వేణుగోపాలపురం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుత్తూరు మున్సిపల్ పరిధిలోనిఇ ముత్తరాసి కండ్రిగ గ్రామంలో శ్రీకృష్ణ భగవానుడికి ఉదయం ఆలయంలో కలశ స్థాపన ఏర్పాటుచేసి విఘ్నేశ్వర పూజ నవగ్రహ పూజ శ్రీకృష్ణుని పరిణయోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రత్యేక హోమం కూడా నిర్వహించి స్వామివారిని అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్న ఆలయ ఆవరణలో అన్నదానం కార్యక్రమం నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుస్వామి ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలంకరణలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి శ్రీకృష్ణ భగవానుడిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**చిన్నశేష వాహనంపై చిద్విలాసుడైన శ్రీకృష్ణుడు**





చంద్రగిరి, ఆగస్టు 18 ప్రభాత వార్త: స్థానిక శ్రీ మురళీకృష్ణ దేవాలయంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీ మురళీకృష్ణ దేవాలయంలో ఈ నెల 14 నుండి శ్రీకృష్ణాష్టమి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు గీతా పారాయణం, 10 గంటల నుండి 12 గంటల వరకు కళ్యాణోత్సవం, 12 గంటలకు ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ, సాయంత్రం శ్రీకృష్ణుడు చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని చిన్నారులు చిన్నికృష్ణులు, గోపికలై అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

## భగవద్గీతలోని బోధనలు తెలుసుకోవాలి : పవార్




శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త : భగవద్గీతలోని బోధనలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ది స్కూల్ కరస్పాండెంట్ జనారనదన్‌రావు జె.పవార్ అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ది స్కూల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణుని తత్వం తెలుసుకోవాలంటే భగవద్గీతను ప్రతి ఒక్కరు చదవాలని కరస్పాండెంట్ సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.విశాల, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.